

ఎఫ్‌ఎలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి - సీతానగరం

ఉద్యోగ భద్రత కల్పించాలని ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్ డిమాండ్ చేసింది. యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.ప్రకాష్ అధ్యక్షతన మధురపూడి సచివాలయంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు మేడిద వరదరామయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 15 ఏళ్లుగా పనిచేస్తున్న తమకు కనీస వేతనం అమలు కావట్లేదన్నారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి నిలబెట్టుకోవాలని విజ్ఞప్తిచేశారు. సమావేశం అనంతరం రాష్ట్ర అధ్యక్షులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మహేష్, జిల్లా నాయకులు శ్రీనివాస్, సత్తిబాబు, చినబాబు, శేషు, శ్రీను, సౌందర్యవతి తదితరులు పాల్గొన్నారు.

గోనె సంచుల కొరత

- జిల్లాలో గన్నీ బ్యాగుల అవసరం 76 లక్షలు
- అందుబాటులో ఉన్నవి 36 లక్షల సంచులే...
- ధాన్యం సేకరణ, లిఫ్టింగ్‌కు తప్పని ఇబ్బందులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

గోనె సంచుల కొనుగోలులో ప్రభుత్వ యంత్రాంగం విఫలమైంది. పంటకోతలు పూర్తయిన తర్వాత రైతులు ధాన్యం నిల్వ చేసుకునే పరిస్థితులు లేవు. దీంతో అన్నదాత కొనుగోలు కేంద్రాలకు తరలించే సమయం కంటే కుప్పలపై కునుకు పట్టడంలేదు. ఆకాల వర్షం కురిస్తే ఆరుగాలం చేసిన కష్టం నీటిపాలయ్యే ప్రమాదం నెలకొంది. నూతన సాంకేతిక విధానంతో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. కొనుగోళ్లలో అత్యంత కీలకమైన గోనె సంచుల ఏర్పాటులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. జిల్లా యంత్రాంగం పౌరసరఫరాల సంస్థ నుంచి గన్నీ బ్యాగులను సమకూర్చుకోవాలి. కొనుగోలుకు నెల రోజుల ముందు నుంచే ప్రణాళిక బద్ధంగా క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాలి. రైతు అవసరాలకు తగ్గట్టుగా సంచులు అందుబాటులో తీసుకురావాలి. ఆ దిశగా చర్యలు లేకపోవడంతో ధాన్యం సేకరణకు, లోడింగ్, అన్‌లోడింగ్‌కు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో దళారులను ఆశ్రయిస్తున్నారు.



4.58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సాగులో 1.48 లక్షల ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేయగా 4.58 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. అయితే ధాన్యం సేకరణకు 76 లక్షల కొత్త గన్నీ బ్యాగులు అవసరముండగా జిల్లాలో కేవలం 36 లక్షలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. అది రొటేషన్ పద్ధతిలో అందరికీ అందజేస్తామని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే 75 శాతం కోతలు పూర్తి కాగా ఈ నెలాఖరు నాటికి ధాన్యం అధికంగా వస్తుంది. అప్పటివరకు గన్నీ బ్యాగులు సరిపడా లేకుంటే ధాన్యం లిఫ్టింగ్‌కు మరిన్ని కష్టాలు తప్పవు. ఇవి ఇప్పటికే ఒకసారి ఉపయోగించినవి కావడంతో అందులో దెబ్బతిన్నవి ఉంటాయి. పూర్తిస్థాయిలో సేకరణకు పనికొచ్చే అవకాశం లేదు. ప్రభుత్వం ఆగమేఘాల మీద ధాన్యం కొనుగోలు చేయాలని చూస్తున్నా క్షేత్రస్థాయిలో ఏ విధంగా లోడింగ్ చేస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. దీంతో కోతలు పూర్తయిన ప్రతి మండలంలో రైతులు ఆందోళన బాట పడుతున్నారు. గత వారంలో గోకవరం మండలంలో రైతులు ఆందోళన బాటపట్టిన విషయం విదితమే. తాజాగా సీతానగరంలోనూ రైతులు గోనె సంచులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గోనె సంచుల సరఫరాపై స్పష్టత కరువు

ధాన్యం సేకరణ కోసం జిల్లాకు సుమారు 85 లక్షల గన్నీ బ్యాగులు అవసరమని రైతులు, రైతు సంఘాలు చెబుతున్నాయి. అధికారులు గణాంకాల ప్రకారం 76 లక్షలకే పరిమితం అయ్యారు. ఆ లెక్కన మరో 40 లక్షల గన్నీ బ్యాగులు అవసరం ఉంది. ఈ సమస్యను పరిష్కరించకుండా కొనుగోలు ఎలా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. జిల్లాలో ఖరీఫ్ సీజన్ లో మొత్తం 4.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా వేశారు. అందులో 2.85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం 239 ఆర్బికెల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరణ చేస్తున్నామని అధికారులు అంచనా వేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఫలితాలు పూర్తి భిన్నంగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరో 40 లక్షల గన్నీ బ్యాగులు వస్తే తప్ప సమస్య తీరేలా లేదు. సీజన్‌కు ముందే అందుబాటులో ఉంచాల్సిన రాష్ట్ర ప్రభుత్వం అందుకుగుణంగా ఏర్పాట్లు చేయకపోవడం తో ధాన్యం సేకరణ సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

నేడు అనంతబాబు బెయిల్‌పై విచారణ

కేసును నీరుగార్చేందుకు పోలీసులు, ప్రభుత్వం కుట్ర

న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం హత్యకేసులో నిందితునిగా ఉన్న ఎంఎల్‌సి అనంతబాబు సుప్రీం కోర్టులో వేసుకున్న డిఫాల్ట్ బెయిల్‌పై సుప్రీంకోర్టులో 12న విచారణ జరుగుతుదని మృతుడు తరుపు న్యాయవాది ముప్పాల సుబ్బారావు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు నిర్దేశించిన సమయంలో చట్ట ప్రకారం ఛార్జిషీట్ దాఖలు చేయలేదన్నారు. కాబట్టి డిఫాల్ట్ బెయిల్ మంజూరు చేయాలంటూ అనంతబాబు సుప్రీం కోర్టును ఆశ్రయించారని తెలిపారు. విచారణ పూర్తికాలేదని, ఇంకా కొంత మంది సాక్షులను విచారించాల్సి ఉందని, టెక్నికల్ రిపోర్టులు ఇంకా రాలేదని తెలుపుతూ పోలీసులు కోర్టులోమెమోలు వేశారని తెలిపారు. వీటినే సుప్రీంకోర్టులో చూపిస్తూ బెయిల్ కోసం ప్రయత్నిస్తునారని తెలిపారు. దీన్ని బట్టి అనంతబాబు బెయిల్‌కోసం పోలీసులు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారనేది స్పష్టమవుతుందన్నారు. అంతేకాకుండా నిందితుని అరెస్టు చేసిన సమయంలో ఎలాంటి నేరచరిత్ర లేదని పోలీసులు న్యాయస్థానానికి చెప్పారన్నారు. మతుని కుటుంబం తరపున నిలబడిన నిందితునిపై గతంలో ఉన్న రౌడీ షీట్‌ని బహిర్గతం చేసి న్యాయం స్థానం దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. ఈ సమయంలో నిందితుని విచారణ అధికారి కస్టడీకి తీసుకునేందుకు పిటీషన్ వేయాల్సి ఉందన్నారు. కాని కోర్టు ముగిసే 10 నిమిషాల ముందు మాత్రమే పిటిషన్ వేయడంతో న్యాయస్థానం కొట్టివేసిందన్నారు. చట్ట ప్రకారం నిందితుని రిమాండ్ ఇచ్చిన 15 రోజుల్లోపు పిటిషన్ వేసి అన్ని చర్యలు పూర్తి చేయాల్సి ఉందన్నారు. కాని అనంతబాబు కేసులో రిమాండ్ చివరి రోజు సాయంత్రం 4.50 నిమిషాలకి కోర్టులో కంటి తుడుపు చర్యగా పిటిషన్ దాఖలు చేసి తిరస్కరించే విధంగా పోలీసులు వ్యవహరించారన్నారు.

ఇప్పటికీ పోలీసు వారు కాల్ డేటా రిపోర్టు గాని, ఎఫ్ఎస్ఎల్ రిపోర్టు గాని, టవర్ లొకేషన్స్ సంబంధించిన సమాచారం గానీ, సిసి ఫుటేజ్‌లకు సంబంధించిన టెక్నికల్ రిపోర్టును నేటికీ సేకరించకుండా కేసును నీరుగార్చేందుకు చూస్తున్నారని ఆయన విమర్శించారు. ఈ కేసులో మిగిలిన నిందితులను గుర్తించకపోవడం విచారణ అధికారి చేతకాని తనానికి నిదర్శనంగా ఉందన్నారు. పోలీసులపై అధికార పార్టీ ఒత్తిడి, అనంతబాబు ప్రభావం ఎంతగా ఉందో దీన్ని బట్టి అర్థమవుతుందన్నారు. సుప్రీంకోర్టులో బాధితుల తరపున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ అగర్వాల్, మీనాక్షి అరోరాలు వాదిస్తారన్నారు. ఈ కేసును సిబిఐకి ఇచ్చి ప్రభుత్వ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. అనంతబాబు ఎంఎల్‌సిని రద్దు చేయాలని కోరినా ప్రభుత్వం స్పందించట్లేదన్నారు. అంతేకాకుండా అధికార పార్టీ ఆధ్వర్యంలో దళిత యువకుడిని హత్య చేసిన అనంతబాబుకి పాలాభిషేకం చేయడం, అతన్ని సింహాలతో పోల్చడం, జైల్లో ఉన్నా గాని అతను అధ్యక్షతన జరిగినట్లుగా శిలాఫలకాలను పెట్టడం ఇవన్నీ చూస్తుంటే ఈ కేసులో నిందితునికి ప్రభుత్వం అండదండలు ఎంత గొప్పగా ఉన్నాయో స్పష్టంగా తెలుస్తుందన్నారు. ఈ కారణాల వల్లే బాధిత కుటుంబం తరపున ఉండి కేసును సిబిఐకి అప్పగించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించామన్నారు. ఇది కూడా 12న విచారణకు వస్తుదన్నారు.

తపాలా శాఖను కాపాడుకోవాలి

తపాల ఉద్యోగుల సంఘాల నాయకులు డిమాండ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

ఐక్య పోరాటాలతో తపాలశాఖాను కాపాడుకోవాలని తపాలా శాఖ ఉద్యోగ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. అఖిల భారత తపాలా ఉద్యోగ సంఘాల సంయుక్త ద్వైవార్షిక మహాసభ ఆదివారం నగరంలోని గేదెల నూకరాజు కళ్యాణ మండపంలో యుజి.ప్రకాష్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి పి3 యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఇ.శంకర్‌నాయుడు మాట్లాడుతూ తపాలా ఉద్యోగుల సమస్యలపై పోరాడుతున్న యూనియన్ ఎన్ఎఫ్‌పిఇ మాత్రమే అని తెలిపారు. పి4 యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.విద్యాసాగర్ మాట్లాడుతూ సభ్యులు సమిష్టి పోరాటాలతో సమస్యలు పరష్కరించుకోవాలన్నారు. జిడిఎస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామీణ డాక్ సేవక్‌లను డిపార్ట్‌మెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గణపతి మాట్లాడుతూ నాయకుడు బాబు తారాపద ముఖర్జీ బాటలో పయనించాలన్నారు. కాకినాడ, అమలాపురం తపాలా డివిజన్ యూనియన్ కార్యదర్శులు ప్రసాదరావు, మధుసూధన్, ఆర్ఎంఎస్ యూనియన్ కార్యదర్శి ఒ.ఎల్.నారాయణ మాట్లాడుతూ దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను అధికారులు తొందరగా పరిష్కరించాలని కోరారు. సిఐటియు నాయకులు మూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు దొచేపెట్టే కుట్ర జరుగుతోందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ఉద్యోగ, కార్మిక సంఘంలు ప్రజలను జాగతం చేసి ఈ కుట్రలను తిప్పికొట్టాలని కోరారు. రాజమండ్రి తపాలా డివిజన్ సూపరింటెండెంట్ పి.కోమల్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులు, అధికారులు సామరస్యంగా ఉంటూ డిపార్ట్‌మెంట్‌ను ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈ సభలో రెండేళ్లలో యూనియన్ సాధించిన ప్రగతి, కార్యదర్శుల నివేదిక, ఆర్థిక నివేదికలపై చర్చించారు. పిదప పి3 యూనియన్ ప్రెసిడెంట్‌గా యు.జి.ప్రకాష్, కార్యదర్శిగా బి.కొండబాబు, కోశాధికారిగా కె.బాబూరావుదొర, పి4 యూనియన్ ప్రెసిడెంట్‌గా ఐ.శ్రీనివాస్, కార్యదర్శిగా జెవి.సతీష్, కోశాధికారిగా జయబాబు, జిడిఎస్ ఉద్యోగ సంఘ ప్రెసిడెంట్‌గా సుబ్బారావు, కార్యదర్శిగా పుష్కరం, ఎన్నుకున్నారు. ఈ కార్యమానికి డివిజన్ నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో ఉద్యోగులు హాజరయ్యారు.



నూతనంగా ఎన్నికైన పోస్టల్ ఉదోగ్య సంఘాల నాయకులు

రానున్నది టిడిపి ప్రభుత్వమే...

'ఇదేం ఖర్మ'లో ఆదిరెడ్డి వాసు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రానున్నది టిడిపి ప్రభుత్వమేనని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక 40వ డివిజన్‌లో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జగన్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మూడున్నరేళ్లలో జగన్ ప్రభుత్వం తీసుకున్న ప్రతి నిర్ణయాలపై రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారన్నారు. టిడిపి అధికారంలోకొస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. మూడున్నరేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయ్యిందన్నారు. అధికార పార్టీకి చెందిన సర్పంచులే ధర్నాలు చేస్తున్నారంటే రాష్ట్రంలో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. మంత్రులు, ఎంఎల్‌ఎలు ప్రగల్భాలు పలకడం తప్ప ప్రజా సమస్యలను పరిష్కరించింది ఎక్కడా లేదన్నారు. రాష్ట్రంలో చంద్రబాబుకు జనం బ్రహ్మరథం పడుతున్నారని, అది చూసి వైసిపిలో వణుకుపుడుతుందన్నారు. వ్యవస్థలన్నీ మళ్లీ బాగుపడాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాల్సి అవసరం ఉందన్నారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ సింహా నాగమణి, టిడిపి నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఆదిరెడ్డి వాసు

గోపవరంలో ఆర్ఒ ప్లాంటు ఏర్పాటు

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని సగ్గొండ పంచాయతీ గోపవరంలో భాగ్యనగర్ క్లోరైడ్స్ ప్రయివేటు లిమిటెడ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఆర్ఒ ప్లాంటును ఏర్పాటు చేశారు. ఆదివారం సర్పంచ్ వై.శేఖర్‌బాబు, కవిత దంపతులతో కలిసి ఎంఎల్ఎ తలారి వెంకట్రావు ఈ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రజల దాహార్తిని తీర్చేందుకు భాగ్యనగర్ క్లోరైడ్స్ ప్రయివేటు లిమిటెడ్ యాజమాన్యం ముందుకు రావడం అభినందనీయమన్నారు. సుమారు రూ.25 లక్షలతో ఈ వాటర్ ప్లాంట్‌ను సంస్థ ఏర్పాటు చేసిందన్నారు. గ్రామానికి రాష్ట్ర ప్రభుత్వం తాళ్లపూడి మండలం గజ్జరం నుంచి గోపవరం గ్రామం వరకు 7.6 కిలోమీటర్ల మేర సుమారు రూ.12 కోట్లతో అత్యాధునిక జర్మన్ టెక్నాలజీతో రోడ్డును నిర్మించిందన్నారు. నూతన రోడ్డు మార్గం ఏర్పాటుతో బస్సు సర్వీసును ఏర్పాటు చేసేందుకు ఆర్‌టిసి రాజమండ్రి రీజనల్ మేనేజర్‌తో మాట్లాడినట్లు తెలిపారు. త్వరలో బస్సును ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారన్నారు. ప్రతి గ్రామంలో తాగునీటి సమస్య ఉందన్నారు. 15 రోజులోల్లగఆ సత్య సాయి మంచినీటి పథకం ద్వారా నీటిని సరపరా చేస్తామన్నారు. ఇప్పటికే ట్రైల్ రన్ పూర్తయ్యిందన్నార. ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేసిన సర్పంచ్ శేఖర్‌బాబును అభినందించారు. ప్రభుత్వంతో పాటు పరిశ్రమలు సహకరిస్తే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రతి సచివాలయంకు రూ.20 లక్షలను ప్రభుత్వం కేటాయించిందని, వాటితో గ్రామాల్లో ప్రధాన సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ క్లోరైడ్ కంపెనీ ఎమ్‌డి అల్లూరి వెంకటసాయిప్రసాద్, జెఎమ్‌డి పర్వతనేని శ్రీనివాసరావు, మేనేజర్ రామారావు, ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కర్‌రావు, పంచాయతీ కార్యదర్శి అనురాధ, ఎఎంసి చైర్మన్ జి.జనార్ధన్‌రావు, వైసిపి మండల అధ్యక్షులు నాగరాజు, జడ్‌పిటిసి సభ్యులు, పలువురు సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ తలారి, సర్పంచ్ దంపతులు

కేంద్రం విధానాలకు వ్యతిరేకంగా నిరసన

చాగల్లు : కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా చాగల్లులో ఆదివారం రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భ:గా ఎపి రైతు సంఘం నాయకులు గారపాటి వెంకటసుబ్బారావు, కంకటాల బుద్ధుడు మాట్లాడారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకొచ్చాక వ్యవసాయ రంగంలో మూడు నూతన చట్టాలను తెచ్చిందన్నారు. అదానీ, అంబానీలకు, కార్పొరేట్ శక్తులకు వ్యవసాయాన్ని అప్పగించేందుకు కుట్ర చేసిందని ఆయన తెలిపారు. కార్పొరేట్ వ్యవసాయం ప్రోత్సహించేందుకు నరేంద్ర మోడీ ప్రభుత్వం అనేక చట్టాలు తీసుకొచ్చిందన్నారు. వ్యవసాయ రంగాన్ని, రైతాంగాన్ని దెబ్బతీసే బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా, రైతాంగ సమస్యలు పరిష్కరించాలన్నారు. రైతులు పండించిన పంటలకు, వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించాలన్నారు. మోటార్లకు విద్యుత్ మీటర్లు పెట్టే ప్రక్రియను ఎత్తివేయాలని, కేరళ తరహాలో రైతులకు రుణమాఫీ చేయాలని, విద్యుత్ చట్ట సంస్కరణలను నిలుపుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు పాల్గొన్నారు.

రబీకి నారుమళ్లు సిద్ధం

చాగల్లు : సార్వా సీజన్ ముగింపు దశకొచ్చింది. పంట కోతలు దాదాపుగా పూర్తయ్యాయి. రోడ్లపై ధాన్యం రాసులు కనబడుతున్నాయి. దీంతో కొంత మంది రైతులు రబీకి సన్నద్ధమవుతున్నారు. ఈ మేరకు ఇప్పటికే చాలా చోట్ల నారుమళ్లు వేశారు. ఎక్కువ మంది రైతులు 1121 రకం వంగడాన్ని సాగుచేసేందుకు మొగ్గుచూపుతున్నారు. అక్కడక్కడా ఎస్ఎల్ 10 రకం వరి వంగడాలను వేస్తున్నారు. ఇప్పటికే పలుచోట్ల దమ్ములను రైతులు పూర్తి చేశారు. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు సహరించట్లేదని, సాయం అందించి ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

పలువురికి 'కుందుల' పరామర్శ

ఉండ్రాజవరం : నిడదవోలు నియోజకవర్గం టిడిపి నాయకులు కుందుల సత్యనారాయణ ఆదివారం మండలంలోని మోర్త గ్రామంలో పలువురిని పరామర్శించారు. గ్రామ పెద్దలు కంటిపూడి సూర్యారావు కుటుంబ సభ్యులను కలిశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే మాతృ వియోగానికి గురైన బొడ్డు శ్రీనును పరామర్శించి సానుభూతిని వ్యక్తం చేవారు. బాధితులకు ఎప్పుడూ అండగా ఉంటానని తెలిపారు.



మండలి చైర్మన్‌కు స్వాగతం పలుకుతున్న గిరజాల బాబు

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలి

నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలని, పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం బలరాంపురం గ్రామంలో వర్షం కారణంగా తడిసిన వరి పంటను సిపిఎం తూర్పుగోదావరి జిల్లా కమిటీ సభ్యులు బేత రాజులోవ రైతులతో కలిసి పరిశీలించారు. వర్షం వళ్ళ పంట నష్టపోయిన రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాజులోవ రైతులతో మాట్లాడుతూ రోజురోజుకూ పెరిగిపోతున్న ఎరువులు, విత్తనాలు, యంత్రాల ధరలు, కూలి రేట్లతో రైతులు, కౌలు రైతులు పంటలు పండించలేని స్థితిలో ఉన్నారన్నారు. కష్ట, నష్టాలకోర్చి రాత్రి, పగలు కస్టపడి పంటలు పండిస్తున్నారన్నారు. ప్రకతి అనుకూలించక, ప్రభుత్వ సాయం అందక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తడిచిన దాన్యాన్ని మద్దతు ధరకే కొనాలని, పాడైన పంటకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేవారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా, డిజన్, మండల అధికారులు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు క్షేత్ర స్థాయిలో పర్యటించి పాడైన పంటను నమోదుచేసి పంటనష్టం చెల్లించాలన్నారు. ఎంత పంట తడిచిందో క్షేత్ర స్థాయిలో పరిశీలించి తడిచిన ప్రతిగింజనూ ప్రభుత్వమే కోనాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట రైతులు పి.తాతారావు, అప్పారావు, సోమయ్య, సత్తిబాబు, కృష్ణ ఉన్నారు.

జాతీయ స్థాయికి 'మద్దూరు' విద్యార్థుల ప్రాజెక్టు

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలకు మండలంలోని మద్దూరు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థుల ప్రాజెక్టు ఎంపికైంది. రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా నుంచి 7 ప్రాజెక్టులు పోటీ పడ్డాయని డిఇఒ ఎస్.అబ్రహం తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థిని ముక్త నవ్యశ్రీ, గైడ్ టీచర్ సీతారామయ్య, జిల్లా సైన్స్ సమన్వయకర్త కన్నూరి సతీష్‌బాబును డిఇఒ అభినందించారు. వచ్చేనెల జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఈ ప్రాజెక్టును ప్రదర్శిస్తారని తెలిపారు.. నెల్లూరు జిల్లా గూడూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అపోస్ట్ మెంబర్ సెక్రెటరీ అపర్ణ, మంత్రి రోజా, ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్ ప్రతాపరెడ్డి చేతుల మీదుగా వీరు బహుమతులు అందుకున్నారని తెలిపారు.

నర్సరీని సందర్శించిన శాసన మండలి చైర్మన్

కడియం : కడియం శ్రీ వెంకటేశ్వరా రోజ్ గార్డెన్‌ని శాసనమండలి చైర్మన్ కె.మోషేన్‌రాజు ఆదివారం సందర్శించారు. వైసిపి రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు ఆయనకు ఘన స్వాగతం పలికారు. నర్సరీ రైతు మార్ని సోంబాబు మోషేన్ రాజుకి నర్సరీలో పలు రకాల మొక్కల గురించి వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తనకు కడియం అన్నా, కడియం ప్రాంత నర్సరీలన్నా చాల ఇష్టమన్నారు. ఆయన వెంట వైసిపి నాయకులు దొడ్డా బుజ్జి, ఉపాధ్యాయుడు సిహెచ్.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

కార్టూ'నిజం'




ప్రజల తలలు తాకట్టు పెట్టి అప్పులు

రోడ్డు చెంతనే చెత్త కుప్పలు

ప్రజాశక్తి-కడియం

కడియం బొబ్బిలి బ్రిడ్జ్ సెంటర్ నుంచి జేగురుపాడు వెళ్లే కాలువగట్టు రహదారిలో కడియం హై స్కూల్ వెనుక రోడ్డు, కడియం లాకులు సమీపంలో రోడ్డుకిరువైపులా చెత్త కుప్పలు పేరుకుపోయాయి. దీంతో స్థానికులతో పాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని కడియపుసావరం గ్రామంలో సేకరించిన చెత్తను పంచాయతీ వాహనాల ద్వారా తీసుకొచ్చి ఈ ప్రాంతంలో డంప్ చేస్తున్నారు. ఈ చెత్త పేరుకుపోయి నిల్వ ఉండడంతో తీవ్ర దుర్వాసన వస్తుందని స్థానిక రైతులు చెబుతున్నారు. సమీపంలోనే స్నానాల రేవు, పశువుల రేవు ఉన్నాయి. నిత్యం కడియపుసావరం, మాధవ రాయుడుపాలెం గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో ఇక్కడకు వచ్చివెళ్తుంటారు. అలాగే లాకుల ప్రాంతానికి ప్రశాంతత కోసం, సేద తీరేందుకు అనేక మంది విద్యార్థులు, యాత్రికులు ప్రతిరోజూ వస్తూవుంటారు. ఎన్నిసార్లు విన్నవించినా, ఎంత మొరపెట్టుకున్నా కడియపుసావరం పంచాయతీ అధికారుల తీరు మారడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రోడ్డు చెంతనే పేరుకుపోయిన చెత్త

తడిసిన ధాన్యం పరిశీలన

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని కానూరు గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యాన్ని టిడిపి నిడదవోలు నియోజకవర్గం సీనియర్ నాయకులు కుందుల వీరవెంకట సత్యనారాయణ ఆదివారం పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అసమర్థత కారణంగా వరి రైతులు తీవ్రంగా నష్టోతున్నారన్నారు. గత టిడిపి ప్రభుత్వ హాయాంలో రైతులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా ఉండేదన్నారు. ప్రస్తుతం రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సకాలంలో ధాన్యం మిల్లులకు వెళ్లని కారణంగా తడిసి పోయిందని తెలిపారు. ఎటువంటి నిబంధనలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

150 మందికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని మల్లవరం గ్రామంలో ఆదివారం శ్రీశివజ్యోతి ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. రాజమహేంద్రవరం గౌతమి నేత్రాలయం వారి సహకారంతో శ్రీఅన్నపూర్ణవిశ్వేశ్వర కళ్యాణ మండపం వేదిక వద్ద ఈ శిబిరాన్ని నిర్వహించారు. ట్రస్టు చైర్మన్ కోర్పు కైలాసనాగహైమావతి ప్రారంభించారు శిబిరంలో 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 20 మందికి కంటి అపరేషన్ల అవసరాన్ని గుర్తించారు. 45 మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ట్రస్టు సభ్యులు కోర్పు వెంకట రాజు, డాక్టర్ కోర్పు ఆదిత్యా విశ్వాస్ పాల్గొన్నారు.

ఓటు నమోదుకు ప్రత్యేక శిబిరం

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి మండలం యర్నగూడెంలో ఆదివారం జడ్‌పి హైస్కూల్ వద్ద ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటు నమోదుకు ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. దేవరపల్లి మాజీ ఎంపిపి గద్దె వెంకట రామారావు ఓటర్ గుర్తింపు కార్డుకు ఆధార్ అనుసంధానాన్ని చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ఎన్నికల వ్యవస్థ అత్యంత కీలకమైందన్నారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలన్నారు.

ఇళ్ల స్థలాల కల్పనకు కృషి

గోకవరం : విలేకర్లకు ఇళ్ల స్థలాలను అందించేందుకు కృషి చేస్తామని ది గోకవరం ప్రెస్‌క్లబ్ కార్యవర్గం తెలిపింది. ఆదివారం గోకవరంలో ది గోకవరం ప్రెస్ క్లబ్ తొలి సమావేశం ప్రధాన కార్యదర్శి కర్రి శివరామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రౌతు పండు పాల్గొని మాట్లాడారు. ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి సహకరించిన దాతలను ప్రెస్‌క్లబ్ తరపున సన్మానించుకోవాలన్నారు. నూతనంగా సభ్యత్వాలు తీసుకున్న సభ్యులకు ఇళ్ల స్థలాలపై చర్చించారు. సభ్యులందరూ ఏకతాటిపై నడిచి ఐక్యంగా ఉంటే దేనినైనా సాధించుకోవచ్చు అన్నారు. ప్రెస్ క్లబ్ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కష్టపడి పని చేయాలన్నారు. నిధులు సమకూర్చేదిశగా ముందుకు వెళ్లాలని కోరారు. ప్రెస్ క్లబ్ నుంచి ఐదుగురు పిఆర్‌ఒలను నియమించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు పాల్గొన్నారు.


తీర్థంలో యాత్రికుల రద్దీ

దుర్గమ్మ తీర్థానికి యాత్రికుల రద్దీ

ప్రజాశక్తి-గండేపల్లి

మురారి కనక దుర్గమ్మ అమ్మవారి తీర్థం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ తీర్థానికి జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా యాత్రికులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మాండోస్ తుపాను ప్రభావం వలన అర్ధరాత్రి నుంచి వర్షం కురవడంతో ఈ ఏడాది యాత్రికుల రద్దీ తగ్గుతేమో కాక రహదారి వెంబడి రోడ్డు బురదగా మారి ద్విచక్ర వాహనాలు జారిపడి భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సిఐ బి.సూర్య అప్పారావు, ఎస్ఐ గణేష్ కుమార్, కిర్లంపూడి ఎస్ఐ తిరుపతిరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం


పతకాలతో చిన్నారి

అమలాపురంలో ఆదివారం నిర్వహించిన థర్డ్ ఎపి స్టేట్ ఇన్విటేషన్ కరాటే టోర్నమెంట్లో నగరంలోని కవలగొయ్యికి చెందిన విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. తొమ్మిది సంవత్సరాల నుంచి 14 సంవత్సరాల విభాగంలో పంచికల లక్ష్మీ లావణ్య, పంచికల హేమశ్రీ, పంచికల సుకన్య, జి.నాగదుర్గతేజ గోల్డ్ మెడల్ సాధించారు. వారిని కరాటే మాస్టర్ పంచికల శ్రీను అభినందించారు.

బస్టాప్ ఏర్పాటు చేయరూ..

ప్రజాశక్తి-జగ్గంపేట

కళాశాల సమీపంలో బస్ స్టాప్ ఏర్పాటు చేయాలని జగ్గంపేట డిగ్రీ కళాశాల విద్యార్థులు కోరుతున్నారు. నియోజకవర్గమైన జగ్గంపేటలో డిగ్రీ కళాశాల టౌన్‌కు సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉండటంతో విద్యార్థులు నాలుగేళ్లుగా పలు ఇబ్బందులు పడుతున్నారు. రాజకీయ నాయకులకు విద్యార్థి సంఘాల నాయకులు మొరపెట్టుకున్నా ఇప్పటికీ ఫలితం లేకపోయింది. సుమారు 400 మంది చదువుతున్న కళాశాలలో 200 మందికి పైగా 10 నుంచి 25 కిలోమీటర్ల దూరం నుంచి బస్సులలో ప్రయాణించి విద్యాభ్యాసం కొనసాగించుతున్నారు.

రోజూ 25 కిలోమీటర్లు ప్రయాణించాలి

నేను జగ్గంపేట డిగ్రీ కళాశాలలో గత రెండేళ్లుగా చదువుతున్నాను. రోజూ 25 కిలోమీటర్ల దూరం నుంచి పయనించి వస్తున్నాను. రెండుబస్సులు మారాల్సి ఉంది. జగ్గంపేట టౌన్‌కు ఒక బస్సులో ప్రయాణించాగా అక్కడ నుంచి కళాశాలకు చేరుకోవాలంటే గోకవరం వెళ్లే మరో బస్సు మారాల్సి వస్తుంది. కళాశాల దగ్గర బస్సు ఆపనందున రెండు కిలోమీటర్లు దూరం కాలినడక వెళ్లాల్సి వస్తోంది.

- వానపల్లి బబ్లి, ప్రత్తిపాడు మండలం ధర్మవరం, డిగ్రీ విద్యార్థి

కళాశాల వద్ద బస్సు ఆగడం లేదు

మా ఊరు జగ్గంపేట మండల పరిధిలో ఉన్న మల్లిసాల కళాశాలకు సుమారు పది కిలోమీటర్ల దూరం ఉంటుంది. గోకవరం బస్సు ద్వారా బస్సు ఎక్కి జగ్గంపేట కళాశాలకు చేరుకోవాలి. టౌన్‌కు వెళ్లకుండానే కళాశాల వస్తుంది. కానీ అక్కడ ఆపడానికి ఆర్టిసి బస్సు సిబ్బంది అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గత రెండేళ్లుగా డిగ్రీ చదువుతున్నాను.

- అయితి చిన్న, జగ్గంపేట మండలం మల్లిసాల గ్రామం

వీడని వర్షం.. తప్పని నష్టం..

ఆందోళనలో వరి రైతులు, ఒడ్డుకు మత్స్యకారుల బోట్లు

ప్రజాశక్తి-కాకినాడ కార్పొరేషన్

రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జిల్లాలోపంట నష్టం తప్పే లేదు. ఒకవైపు వర్షం మరోవైపు చలిగాలులు తీవ్రతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. కాకినాడ జిల్లామత్స్యకార బోట్లు ఒడ్డుకు చేరుకున్నాయి. ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికిజిల్లా వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తమ పనులు చేసుకునేందుకు బయటకు రాకుండా ఒక పక్కన


ఒడ్డుకు చేరిన బోట్లు

చలిగాలులు తీవ్రతతో మనుషులను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. వర్షాలు ఇలాగే కొనసాగితే పంట నష్టం మరింత పెరుగుతుందని, అటు అధికారులు, ఇటు నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాకినాడ జిల్లాలో ఒకటక లక్ష 38 వేల ఎకరాల్లో వరిని సాగు చేయగా 500 ఎకరాల్లో కోత కోసిన చేను పనలు మీద ఉందని, 150 ఎకరాల్లో వరి సాగు పూర్తిగా నేలను తాగిందని వ్యవసాయ అధికారులు తెలిపారు.ఇది కేవలం శనివారం నాటికి సంబంధించిన వివరాల అధికారంలో వెల్లడించారు.మరో రెండు రోజుల వివరాలు రావలసిన తరుణంలో నష్టం ఎంత ఉంటుందో అంచనా వేయలేకపోతున్నారు. ప్రస్తుతం 75 వేల టన్నుల ధాన్యం బరకాల కింద ఉండగా దీనికి ఎటువంటి నష్టం ఉండదని అధికారులు చెబుతున్నారు.అయితే కళ్లాలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. తడిసిన ధాన్యంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండలు కాసే వరకు కోతల కోయొద్దని రైతులకు అధికారులు సూచిస్తున్నారు.


సాయం అందిస్తున్న సిఐ

మృతుల కుటుంబాలకు సాయం

ప్రజాశక్తి -రౌతులపూడి

మండలంలోని ఎస్.పైడిపాల గ్రామ శివారు క్వారీ బ్లాస్టింగ్ ప్రమాదంలో మృతి చెందిన పాలోజు వరహాలు, లక్ష్మీ దుర్గ భవాని దంపతుల కుటుంబానికి ఆదివారం తుని రూరల్ సిఐ ఎ.సన్యాసిరావు, కోటనందూరు ఎస్ఐ స్వామి నాయుడు రూ.పది వేల నగదు, నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పార్టీలకతీతంగా కల్యాణోత్సవాలు

ప్రజాశక్తి-పెదపూడి

ఉషా పద్మినీ ఛాయా సౌంజ్ఞ సమేత శ్రీసూర్యనారాయణస్వామి కళ్యాణోత్సవాలను పార్టీలకు అతీతంగా గ్రామంలోని ప్రజలు, యువత కలిసి జరుపుకోవాలని మాజీ జెడ్‌టిసి సత్తిభగవాన్ రెడ్డి సూచించారు. గొల్లలమామిడాడలో ఆదివారం కళ్యాణోత్సవాలను ఫిబ్రవరి 2న నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన ఉత్సవ కమిటీ సమావేశంలో వివిధ ఏర్పాట్లపై చర్చించారు.

ఆకట్టుకున్న కళాకారుల నృత్య నీరాజనం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడలో శాస్త్రీయ నృత్య కళాకారుల సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో దంటు కళాక్షేత్రంలో ఆదివారం కళాకారులు ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. శాస్త్రీయ నృత్యం భరతనాట్యం, కూచిపూడి నృత్య భంగిమలు, సాక్షాత్ నటరాజ తాండవాన్ని కన్నులకు కట్టినట్టు ప్రదర్శించారు. ఈ సందర్భంగా కాకినాడ శాస్త్రీయ నృత్య కళాకారుల సంక్షేమ సమాఖ్య నాట్య గురువుల సారధ్యంలో 10వ సంవత్సరం ఈ నృత్య నీరాజనం నిర్వహిస్తున్నట్లు సమాఖ్య జనరల్ సెక్రటరీ హరి లోకేష్ శర్మ తెలిపారు.


కళాకారుల నృత్య ప్రదర్శన

కాకినాడ నగరంలో 36 నాట్యశాలలు ఉన్నాయని, వాటికి అనుబంధంగా రాష్ట్ర వ్యాప్తంగా 86 నాట్యశాలలకు సంబంధించిన సుమారు 850 మంది పైగా నృత్య కళాకారులు, కళాకారిణులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ రూరల్ ఎంఎల్ఎ కన్నబాబు, సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు. శాస్త్రీయ నృత్య కళాకారుల సంక్షేమ కోసం ప్రభుత్వం అన్ని సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. సమాఖ్య అధ్యక్షులు ఒ.వి.ఎస్.ప్రసాద్, కార్యదర్శి ఆనెం ప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మధు

రాజకీయాలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-కాకినాడ

కార్మికులకు దేశంలో రాష్ట్రంలో పాలకులు చేపడుతున్న విధానాలపై అవగాహన అవసరమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు అన్నారు. ఆదివారం ఎఐటియుసి ఆధ్వర్యంలో జట్లు సంఘం కార్మికుల వనభోజనాల్లో ఆయన మాట్లాడారు. శతాబ్దాల కాలంగా అనేక పోరాటాలు త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను నరేంద్ర మోడీ ప్రభుత్వం రద్దు చేస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను బడా కార్పొరేటర్ వ్యక్తులకు అమ్మివేస్తున్నారని, కార్మికులు ఐక్య పోరాటాలు ఉధతంగా చేస్తేనే మోడీ తగ్గుతారన్నారు. ఉదాహరణకు రైతు రైతు ఉద్యమం అని ఆయన అన్నారు. పాలకులు సహజ సంపద అయిన అడవులు, భూమి, నీరు, ఆకాశం వంటి ప్రకతి వనరులన్నీ అంబానీ ఆదానీలకు కట్టబెడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, నాయకులు పిఎస్ నారాయణ, సిపిఐ కాకినాడ జిల్లా కార్యదర్శి బోడకొండ, నాయకులు పి.సత్యనారాయణ, బొమ్మసాని రవిచంద్ర, కె.జ్యోతిరాజు, త్రిమూర్తులు, రామకృష్ణ పాల్గొన్నారు.

గోనె సంచుల్లేక రైతుల అష్ట కష్టాలు

ప్రజాశక్తి - సీతానగరం

రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకునేందుకు రైతులు నానా తంటాలూ పడుతున్నారు. ఒక పక్కన సంచులు లేక ఇబ్బందులు పడుతుంటే మరోపక్క రవాణా సౌకర్యం లేక ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. సీతానగరం మండలంలో దాదాపు అన్ని రైతు భరోసా కేంద్రాల వద్దా ఇదే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండించిన పంటను పొలంలో ఒబ్బిడి చేసి భద్రపరుస్తున్నప్పటికీ వాతావరణంలో తరచూ మార్పులు సంభవిస్తున్నాయి. అకాల వర్షం కురిసి ధాన్యం నీళ్ల పాలవుతుందని ఆందోళన చెందుతున్నారు. అధికారులు మాత్రం రైతులు పండించిన ధాన్యాన్ని దళారులు లేకుండా నేరుగా రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టినట్టు చెబుతున్నారు. అధికారులు మాటలు మాత్రం చెబుతున్నారని, అందుకు తగ్గట్టు చర్యలు చేపట్టడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రతీ గ్రామంలో రైతు భరోసా కేంద్రాల వద్ద ధాన్యం


గోనె సంచుల కోసం నిరీక్షిస్తున్న రైతు

కొనుగోళ్లకు సంబంధించి సరిపడా సంచులు లేక ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు సరిపడా సంచులు ఇవ్వకుండా సప్లయ్ లేదని అంతంతమాత్రంగా అందిస్తుండడంతో మిగిలిన ధాన్యాన్ని ఏమి చేయాలో అర్థం కావడం లేదని వాపోతున్నారు. పండించిన మొత్తం ధాన్యం కళ్లంలోనే ఒబ్బిడి చేసుకున్నామని, ఒబ్బిడి చేసిన ధాన్యాన్ని పట్టుబడి పట్టి ఎగుమతి చేయాల్సిందన్నారు. అయితే రవాణా సౌకర్యం కూడా రైతులే కిరాయి పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం రవాణా సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో పట్టుబడి పట్టిన ధాన్యం కేటాయించిన మిల్లులకు పంపేందుకు వీలు కలగడం లేదని ఆరోపిస్తున్నారు. దీంతో ఏం చేయాలో అర్థంకాక అయోమయ పరిస్థితుల్లో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంచుల కోసం ఆర్.బి.కెల వద్ద పడిగాపులు కాస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు రైతులకు కావాల్సిన సంచులను, రవాణా సౌకర్యం కూడా కల్పించాలని కోరుతున్నారు. లేకుంటే ధాన్యాన్ని తరలించడం చాలా కష్టమని తెలిపారు. రైతులు ధాన్యం విక్రయించాలంటే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా గోనె సంచులను సరఫరా చేయాల్సి ఉంది. తగినన్ని గోనె సంచులు అందుబాటులో లేవు. మిల్లర్ల దగ్గరే గోనె సంచులు ఉండడం వలన వారి నుంచి సంచులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రైతు భరోసా కేంద్రాలు వద్ద గోనె సంచులు అందుబాటులో ఉంచడం లేదు. మిల్లర్ల దయా దాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కొత్తపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

హక్కులతో పాటు బాధ్యతలూ నెరవేర్చాలి

ప్రజాశక్తి -కొత్తపేట

హక్కులతో పాటు ప్రతి పౌరుడు తన బాధ్యతలను కూడా నెరవేర్చాలని న్యాయవాదులన్నారు. సీనియర్ న్యాయవాదులు ఎ.ఆదినారాయణ, డి.బాల ప్రతాప్ అన్నారు. విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల కొత్తపేట నందు ఎన్ఎస్ఎస్ అధికారి, వైస్ ప్రిన్సిపల్ ఎస్.అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానతులుగా. సీనియర్ న్యాయవాదులు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి మనిషికి భారత రాజ్యాంగం కల్పించినటువంటి మానవ హక్కులు ఉన్నాయన్నారు. ప్రతి పౌరుడు స్వేచ్ఛగా జీవించే హక్కు ఆస్తి హక్కు, విద్యను పొందే హక్కు కలిగి ఉన్నారని అన్నారు. ఏ పౌరుడైనా ఒకరి హక్కులకు భంగం కలిగిస్తే, వారి హక్కులను హరిస్తే రాజ్యాంగ చట్టం ప్రకారం వారి మీద చర్య తీసుకునే హక్కు న్యాయస్థానాలకు ఉందన్నారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరునికి తమ హక్కులను స్వేచ్ఛగా ఉపయోగించు కునే అధికారం ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఎన్.నాగేశ్వరరావు , చంద్రశేఖర్, సూర్యారావు, ఎం.శ్రీనివాస్, ఎ. కాంతరాజు, కె.సత్యం తదితరులు, విద్యార్థులు హాజరయ్యారు. అనంతరం మానవ హక్కులు కాపాడుకోవాలని, మానవ హక్కులను హరించరాదని ర్యాలీ నిర్వహించారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులతో జెవివి నాయకులు

ఉత్సాహంగా చెకుముకి పోటీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

జెవివి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెకుముకి పోటీలు దానవాయిపేటలోని భాష్యం పబ్లిక్ స్కూల్లో ఉత్సాహంగా సాగాయి. మండల స్థాయి విజేతలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. జిల్లా స్థాయి పోటీలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విభాగాల్లో నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో భూపతిపాలెం ఎంపిఆర్ స్కూల్ విద్యార్థులు ప్రథమ, రఘుదేవపురం జడ్‌పిహెచ్ఎస్ విద్యార్థులు ద్వితీయ, శ్రీ కంటిపూడి రామారావు మున్సిపల్ కార్పొరేషన్ హై స్కూల్ విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. ప్రయివేటు పాఠశాలల విభాగంలో దివాన్ చెరువు శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు ప్రథమ, కాతేరు శ్రీ సద్గురు విద్యాలయం విద్యార్థులు ద్వితీయ, రాజమహేంద్రవరం శ్రీ షిరిడీసాయి విద్యానికేతన్ విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. అనతరం జెవివి నాయకులు సిహెచ్.శ్రీరాములు మ్యాజిక్ షో నిర్వహించారు.

ప్రమాదకరంగా ఆర్అండ్‌బి రహదారి

ప్రజాశక్తి - గోపాలపురం

గుంతలతో గోపాలపురం - దొండపూడి రోడ్డు ప్రమాదకరంగా మారింది. రోడ్డు గుంతలు పూడ్చేందుకు వేసిన బంక మట్టి వర్షాలకు తడవడంతో దానిపైనుంచి వెళ్లే వాహనాలు అదుపుతప్పుతున్నాయని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోపాలపురం నుంచి దొండపూడి వరకు 12 కిలోమీటర్లు మేర రోడ్డు పెద్దపెద్ద గోతులతో అధ్వాన్నంగా తయారైంది వారంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకొచ్చినప్పటి నుంచి నిధులు మంజూరయ్యాయని చెప్పడమే తప్ప ఇప్పటివరకు రోడ్డు పనులు చేపట్టలేదని తెలిపారు. అయితే దొండపూడి నుండి గోపాలపురం మీదుగా తాడువాయి షుగర్ ఫ్యాక్టరీ కు వెళ్లేందుకు చెరుకు లోడు ట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయన్నారు. గోతుల్లో పడి బోల్తా పడే ప్రమాదం ఉందని తెలిపారు. వర్షాలకు గుంతల్లో పూడ్చిన బంక మట్టి కరగడంతో వాహనదారులు అదుపుతప్పి పడిపోతున్నారు. రోడుకు ఇలా పది నుంచి 15 వరకూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.


రోడ్డుపై బంకమట్టి వేయడంతో జారిపోయిన ద్విచక్ర వాహనం

రాజకీయ చైతన్యం అవసరం

ప్రజాశక్తి-అమలాపురం

మాదిగలు రాజకీయ చైతన్యం కలిగి ఉండాలని బాపట్ల ఎంపి నందిగం సురేష్ అన్నారు. ఆదివారము అమలాపురంలో నిర్వహించిన మాదిగ రాజకీయ చైతన్య సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లాలో వచ్చే ఎన్నికల్లో రెండు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానం కేటాయించాలని మాదిగ పొలిటికల్ జెఎసి డిమాండ్ చేసింది. కార్యక్రమంలో పొలిటికల్ జెఎసి ఛైర్మన్ బొమ్మి ఇజ్రాయల్, కాపు జెఎసి నాయకులు కల్వకొలను తాతాజీ, శెట్టిబలిజ నాయకులు కుడుపూడి సూర్య నారాయణరావు, వాసంశెట్టి సుభాష్, ఎంఆర్‌పిఎస్ నాయకులు పెదపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. చైతన్య సభ సందర్భంగా పట్టణంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సుమారు 500 మందితో భారీ 'పోలీసు బందోబస్తు' ఏర్పాటు చేశారు. **ఉప్పలగుప్తం** అమలాపురంలో ఆదివారం నిర్వహించిన ఈసభకు నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. యువకులు మోటారు సైకిళ్ళ ర్యాలీ నిర్వహించారు. తరలి వెళ్లిన వారిలో నాయకులు తొత్తరమూడి నరసింహారావు, చేట్ల విద్యాసాగర్, మడికి శ్రీరాములు, వంగలపూడి నరసింహమూర్తి, తదితరులు ఉన్నారు.


గోతులమయంగా ఉన్న నేలటూరు రోడ్డు

గోతులు పూడ్చాలని వినతి

ప్రజాశక్తి-మండపేట

మండపేట నేలటూరు రోడ్డు గోతుల మయంగా మారింది. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. గత కొన్నేళ్లుగా ఈ రోడ్డు అభివృద్ధికి నోచుకోలేదు. సుమారు కిలోమీటర్ల పొడవు ఉన్న ఈ రోడ్డులో గోతులు పడడంతో వాటిని తప్పించే ప్రయత్నంలో ప్రమాదాల బారిన పడుతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో పరిస్థితి మరింత అద్వానంగా ఉంటుందని ప్రయాణికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోతులు పూడ్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

ఎలక్ట్రానిక్ కాటాలు లేని ఏడు దుకాణాలపై కేసుల నమోదు

ప్రజాశక్తి -అమలాపురం

విజిలెన్స్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్‌పి బాగ్చి ఆదేశాల మేరకు ఎస్‌పి పి.వి.రవి కుమార్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు, లీగల్ మెట్రాలజీ అధికారులు మూడు బందాములుగా ఏర్పడి ఆదివారం చికెన్, మటన్ చేపల షాప్‌ల్లో తనిఖీలు నిర్వహించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని రావులపాలెం మండలంలో 14 చికెన్, మటన్ చేపల షాపుల్లో తనిఖీలు నిర్వహించి 7 షాపుల్లో ఎలక్ట్రానిక్ కాటాలకు స్టాంపింగ్ లేకపోవుట గుర్తించారు. మొత్తం 7 కేసులు నమోదు చేశారు. ఏడు షాపుల నందు తూకాల్లో ఎటువంటి వ్యత్యాసాలు లేవు. ఈ తనిఖీల్లో డిఎస్‌పి పి.ముత్యాలనాయుడు, కార్యాలయ ఇన్‌స్పెక్టర్లు సత్యకిషోర్, రమేశ్ శ్రీనివాసరెడ్డి, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ, వ్యవసాయాధికారి భార్గవ మహేశ్, కానిస్టేబుల్స్ వలి, లోవరాజు, ఈశ్వరరావు, వీరబాబు లీగల్ మెట్రాలజీ అధికారులు పాల్గొన్నారు.


తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

జక్కంపూడి ఆరోగ్యం కోసం ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - సీతానగరం

వైసిపి కేంద్ర కమిటీ సభ్యులు జక్కంపూడి విజయలక్ష్మి ఆరోగ్యం బాగుపడాలని ఆ పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చినకొండేపూడిలోని ఘంటా శ్రీనివాసరావు ఇంటి నుంచి సింగవరం విజయదుర్గ ఆలయానికి పాదయాత్రగా చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఘంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ జక్కంపూడి విజయలక్ష్మి ఆరోగ్యం కుదుట పడాలని ఈ పూజలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కోకన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, మండల సలహాదారు చల్లమళ్ల సుజిరాజు, వైసిపి నాయకులు గద్దే వెంకటకష్ణ చౌదరి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కొండ్రాపు ముత్యాలు, మట్టా కాపు, మట్టా శ్రీను, మద్దాల కొండలరావు, సలాది వాసు, మనెల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.


పూజలు నిర్వహిస్తున్న మండల వైసిపి కన్వీనర్ శీనివాసరావు